సాక్షి
నిజామాబాద్
శనివారం । 22 । మార్చి । 2025



ఆశావర్కర్ల పోరుబాట

డిమాండ్ల సాధన కోసం జిల్లాలో ఆశావర్కర్లు పోరుబాట పట్టారు. వేతనాలు పెంచాలని నిరసన తెలుపుతున్నారు.

-8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ శని : 6:33 | సహర్ ఆది : 4:56

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.4 /21.4

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కబోతగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

నల్లవెల్లిలో తడిసిన ధాన్యం కుప్పలు



రెంజర్లలో తడిసిన పసుపు



భిక్కనూరులో నేలవాలిన మొక్కజొన్న



నేలరాలిన రైతుకష్టం

- జిల్లా వ్యాప్తంగా అకాల వర్షం
- సిరికొండ, ధర్పల్లి మండలాల్లో రాళ్లవాన
- వరి, మామిడి పంటలకు తీవ్ర నష్టం

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. చేతికొచ్చిన పంటలను ప్రకృతి దెబ్బతీసింది. గురు, శుక్రవారాల్లో కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల దెబ్బకు రైతుల కష్టం నేలరాలింది. రాళ్ల వానతో సిరికొండ, ధర్పల్లి మండలాల్లో కోత దశకు వచ్చిన వరికి తీవ్ర నష్టం జరిగింది. వడగళ్ల ధాటికి వరి గింజలు రాలిపోయాయి. కల్లాల్లో ఆరబెట్టిన వడ్లు, పసుపు పంట తడిపోయింది. మామిడి కాయలు రాలిపోయాయి. పంటలు దెబ్బతినడంతో రైతన్నలు కన్నీరుమున్నీరవుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పంటనష్టం లెక్కలు తీస్తున్నారు. శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించాలని వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. వర్షాల భయానికి రైతులు ముందస్తు వరి కోతలకు వెళ్తున్నారు.



డొంకేశ్వర్‌లో నేలకొరిగిన వరి

■ ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లో గురువారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలు గ్రామాల్లో వరి నేలకొరిగింది. మామిడి నేలరాలింది. కల్లాల్లో ఆరబోసిన పసుపు రాశులు స్వల్పంగా తడిశాయి.

ధర్పల్లి : మండలంలోని హొన్నాజీపేట్, వాడి, మద్దుల్ తండా, గుడి తండా గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. పంట నేలకొరగడంతో పాటు వరి గింజలు రాలిపోయాయి.

సిరికొండ: మండల కేంద్రంతోపాటు మైలారం చిన్న వాల్గోట్, పెద్దవాల్గోట్, పోతునూర్, కొండూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. కొండూరు గ్రామంలో వడగళ్ల వాన కురవడంతో ధాన్యం రాలిపోయింది.



కొండూర్‌లో కురిసిన వడగళ్లు



ధర్పల్లి మండలం హొన్నాజీపేట్‌లో వడగళ్ల వానకు నేలరాలిన వరి గింజలు

ఇందల్వాయి: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. ఆరబోసిన ధాన్యం తడవకుండా కాపాడేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

బాల్కొండ: నియోజకవర్గంలో గురువారం రాత్రి అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. ఉడికించి ఆరబెట్టిన పసుపు తడిసింది. శుక్రవారం ఎండ తీవ్రత ఉండడంతో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంది.

ముందస్తు కోతలు..

ఇందల్వాయి: జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో గుబులు పుట్టుకుంది. గతేడాది అకాల వర్షాలతో వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఆ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తుగా వరి కోతలు ప్రారంభించారు. గురువారం రాత్రి వర్షం కురవడంతో భయాందోళన చెందిన రైతులు.. శుక్రవారం ఉదయం వరికోత యంత్రాలను ఆశ్రయించారు. కాగా, వడగళ్ల వాన భయంతో గింజ పూర్తి పరిపక్వతకు రాకపోయినా వరి కోస్తున్నారు. ముందస్తు కోతలతో ధాన్యంలో తాలుశాతం పెరిగే అవకాశం ఉంది. దీంతో మిల్లర్లు రైతులను దోచుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆదివారం వరకు వర్ష సూచన ఉండడంతో వేల ఎకరాల్లో పచ్చి వరిపైర్లను కోసే అవకాశం ఉంది.



నల్లవెల్లిలో వరి కోస్తున్న హార్వెస్టర్

రెండు లక్షలు నష్టపోయా..



గతేడాది యాసంగిలో వడగళ్ల వానకు వడ్లు మొత్తం రాలిపోయాయి. దీంతో సుమారు రూ.2 లక్షలు నష్టపోయా. ఈసారి కూడా అలాగే జరుగుతుందనే భయంతో ముందుగానే పంటను కోస్తున్నాం. పంటనష్టం తర్వాత ప్రభుత్వం ఇచ్చే పరిహారం కన్నా పచ్చివడ్లు అమ్మడం ద్వారానే డబ్బులు ఎక్కువ వస్తాయని భావిస్తున్నాం.

– నోముల వెంకట్‌రెడ్డి, రైతు, నల్లవెల్లి.

కామారెడ్డిలో పిడుగులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పలు ప్రాంతాలలో కురిసిన వర్షంతో పంటలు దెబ్బతిన్నాయి. రాజంపేట మండలం అర్గొండలో 21 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మాచాపూర్‌లో 9 మిల్లీ మీటర్లు, దోమకొండలో 8.9 మిల్లీ మీటర్లు, సదాశివనగర్‌లో 6.3 మిల్లీ మీటర్లు, లింగంపేటలో 6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. లింగంపేట మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామంలో పిడుగుపాటుకు రెండు గేదెలు, అదే మండలంలోని పోతాయిపల్లిలో మూడు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. తిమ్మారెడ్డిలో ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుత్ స్తంభం విరిగిపడింది. పలుచోట్ల వరి పంట నేలకొరిగింది. మక్క, జొన్న పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. దోమకొండ శివారులో ఓ రేకుల షెడ్డు గాలికి కొట్టుకుపోయింది.



తిమ్మారెడ్డిలో ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడ్డ విద్యుత్ స్తంభం



పోతాయిపల్లిలో పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

‘పది’ పరీక్షలు ప్రారంభం



నగరంలోని కాకతీయ పాఠశాల సెంటర్ వద్ద బారులు తీరిన విద్యార్థులు

- తొలిరోజు ప్రశాంతం
- కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్ / ఆర్మూర్ టౌన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షకు 22,774 మందికి విద్యార్థులకుగాను 22,715 మంది హాజరయ్యారు. 59 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభంకాగా గంట ముందు నుంచే విద్యార్థులను లోనికి అనుమతించారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా పరిశీలించి కేంద్రంలోకి పంపించారు. ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించి, విద్యార్థులు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారులను ఆదేశించారు. ఎక్కడా కాపీయింగ్‌కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పెర్కిట్‌లోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, చీఫ్ సూపరింటెండెంట్ కవిత ఉన్నారు.



ఆర్మూర్‌లో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

కలెక్టరేట్ ముట్టడి



- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి వ్యతిరేకంగా బాన్సువాడ కాంగ్రెస్ నాయకుల ఆందోళన
- గుండెపోటుతో మరణించిన కాంట్రాక్టర్ శవంతో నిరసన

నిజామాబాద్ అర్బన్: కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. గుండె పోటుతో మృతి చెందిన కాంట్రాక్టర్ మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తీరుపై నిరసన వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.

బాన్సువాడ నియోజకవర్గానికి ఇటీవల ఎస్ఆర్ఈజీఎస్ పనులు మంజూరయ్యాయి. వీటిని స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి ఇస్తున్నారని మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి ఇవ్వడం లేదని పలువురు కాంగ్రెస్ నాయకులు అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం బాన్సువాడ నియోజకవర్గంలోని 9 మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సుమారు 400 మంది వివిధ వాహనాలలో నిజామాబాద్ కలెక్టరేట్‌కు తరలి వచ్చారు. కలెక్టరేట్ ప్రవేశం మార్గం వద్ద బైఠాయించారు. జిల్లా కలెక్టర్ బయటకు రావాలంటూ నినాదాలు చేశారు. ఎంపీడీవోలు నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పిన వారికే పనులు అప్పగిస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా కలెక్టర్ లేకపోవడంతో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ప్రవేశ మార్గం వద్దకు వచ్చి కాంగ్రెస్ నాయకులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారమే పనులు కేటాయించాలని ఆందోళనకారులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. అదే సమయంలో బీర్కూరు మండలం దామరంచకు చెందిన కాంట్రాక్టర్ ఇక్బాల్ గుండెపోటుతో ఆయన స్వగ్రామంలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు కాంట్రాక్టర్ శవాన్ని కలెక్టరేట్‌కు తరలించి ఆందోళన చేశారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఆందోళనకారులను కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి పెట్టిన ఇబ్బందుల వల్లనే కాంట్రాక్టర్ ఇక్బాల్ గుండెపోటుతో మరణించారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. గతంలో ఇక్బాల్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బిల్లులు రాకుండా అడ్డుకుంటున్నారని, వేధింపులకు గురి చేస్తున్నాడని సామాజిక మాధ్యమంలో పోస్టులు కూడా పెట్టినట్లు ఆందోళన కారులు పేర్కొన్నారు. మృతదేహంతో అరగంట పాటు నిరసన వ్యక్తం చేసి వెళ్లిపోయారు. ఆందోళనలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎలమంచిలి శ్రీనివాసరావు, బాన్సువాడ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు పాత బాలకృష్ణ, గణేశ్ నందుపటేల్, కమలాకర్‌రెడ్డి వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు, కాంట్రాక్టర్ మృతదేహంతో కొడుకు(ఇన్‌సెట్‌లో)

న్యూస్‌రీల్

టౌన్‌ప్లానింగ్‌కు 14 మంది ఉద్యోగులు



నిజామాబాద్ సిటీ: జిల్లాలోని మూడు మున్సిపాలిటీల టౌన్‌ప్లానింగ్ విభాగంలో 14 మంది ఉద్యోగులు కొత్తగా విధుల్లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఏడుగురు, బోధన్‌కు నలుగురు, ఆర్మూర్‌కు ముగ్గురిని నియమించింది. కొత్తగా వచ్చిన ఉద్యోగులు శుక్రవారం ఆయా మున్సిపాలిటీల్లో జాయినింగ్ రిపోర్టు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్‌లుగా విధులు నిర్వర్తించనున్నారు.

మహిళా సంఘాల ద్వారా విత్తనాల విక్రయం

- తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



నిజామాబాద్‌అర్బన్: వచ్చే ఖరీఫ్ సీజన్‌కు మహిళా సంఘాల ద్వారా వివిధ పంటల విత్తనాలు విక్రయించనున్నట్లు తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల్లో మహిళా సంఘాల ద్వారా తెలంగాణ సీడ్స్‌కు సంబంధించిన విత్తనాలను రైతులకు సరఫరా చేస్తామన్నారు. మహిళా సంఘం ద్వారా సరఫరా అయిన విత్తనాలకు పంటల మేరకు అమ్మకపు ధరపై 1 నుంచి 8 శాతం వరకు సేవ చార్జీలను అందిస్తామని తెలిపారు. నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయడంతో రైతులకు మేలు చేకూరడంతోపాటు మహిళా సంఘాలకు ఆర్థిక తోడ్పాటు అందించినట్లు అవుతుందన్నారు. సమావేశంలో డీఆర్డీవో సాయాగౌడ్, రీజినల్ మేనేజర్ రఘు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: అనధికార లే–అవుట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో సూచించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం నూతన నిర్ణయాలు తీసుకుందన్నారు. ఎఫ్‌టీఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించినట్లు తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయి పరిశీలించుకోవాలన్నారు. దరఖాస్తుదారులు ఈనెల 31లోగా ఫీజు చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు. రుసుము చెల్లించిన వారి దరఖాస్తును అధికారులు పరిశీలించి వెంటవెంటనే అనుమతి మంజూరు చేస్తారన్నారు.

డ్యూ లిస్టు ముందే సిద్ధం చేసుకోవాలి

నిజామాబాద్ నాగారం: ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవాల్సిన వారి జాబితా(డ్యూ లిస్ట్)ను ముందు రోజే సిద్ధం చేసి, లబ్ధిదారులందరికీ సమాచారం అందించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సిబ్బందికి సూచించారు. నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శుక్రవారం వ్యాధి నిరోధక టీకాల విభాగం ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాల సూక్ష్మ ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. పీహెచ్‌సీల సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తూ శుక్రవారం గుండెపోటుతో మృతిచెందిన డాక్టర్ శ్రీకాంత్‌కు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంవో డాక్టర్ అతుల్ నెగి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

8.5 శాతానికి తగ్గిన ఎన్‌పీఏ

- ఎన్‌డీసీసీబీని ప్రథమస్థానంలో నిలపాలి
- చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి

సుభాష్‌నగర్: ఎన్‌డీసీసీబీని రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిపేలా సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, సొసైటీ చైర్మన్లు కృషి చేయాలని ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 14 శాతం ఉన్న ఎన్‌పీఏ 8.5 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు. నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు వ్యాపార కార్యకలాపాలు రూ.1800 కోట్ల నుంచి రూ.2100 కోట్లకు పెరిగిన సందర్భంగా చైర్మన్ కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చైర్మన్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరంలో ఎన్‌పీఏ తగ్గింపునకు సిబ్బంది చేసిన కృషి అభినందనీయమన్నారు. ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, సీఈవో నాగభూషణం వందే, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి

నేడు మున్సిపల్ కమిషనర్‌తో ‘సాక్షి’ ఫోన్‌ఇన్



నిజామాబాద్ నగర ప్రజలు తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ, ఇతర సమస్యలపై నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌తో నేరుగా మాట్లాడొచ్చు.

తేది : 22-03-2025 (శనివారం)

సమయం : ఉదయం 10.00 నుంచి 11.00 గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్: 78159 57047 / 99897 09595



క్లుప్తంగా

గోవులను తరలిస్తున్న వాహనం అడ్డగింత



రుద్రూర్: మండల కేంద్రంలో గోవులను తరలిస్తున్న వాహనాన్ని గురువారం అర్ధరాత్రి బజరంగ్‌దళ్ నాయకులు అడ్డుకున్నారు. రెంజల్ మండలం సాటాపూర్ నుంచి రుద్రూర్ మీదుగా జహీరాబాద్ వైపు వెళ్తున్న ఐచర్ వాహనంలో గోవులను తరలిస్తున్నారనే సమాచారం రావడంతో వారు రుద్రూర్‌లో వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. వాహనంలో ఉన్న పశువులను బోధన్ గోశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

తెయూకు అంబులెన్స్ అందజేత



తెయూ(డిచ్‌పల్లి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (టీజీ యూనివర్సిటీ బ్రాంచ్) ఆధ్వర్యంలో శుక్రవారం డీజీఎం బిజయ్‌కుమార్ సాహూ తెలంగాణ యూనివర్సిటీకి అంబులెన్స్‌ను అందజేశారు. వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, ఎస్‌బీఐ ఏజీఎం మహేశ్వర్ కొలాటే, బ్రాంచ్ మేనేజర్ శివనారాయణ సింగ్, సిబ్బంది రాథోడ్ రవీందర్, రాజేష్, గిరిప్రసాద్, ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, పీఆర్‌వో పున్నయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, భాస్కర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఎడపల్లి రైల్వేగేట్ మూసివేత

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి–బోధన్ ప్రధాన రహదారిపై ఉన్న రైల్వేగేట్‌ను ఈనెల 26న ఉదయం 6 గంటల నుంచి 28వ తేదీ రాత్రి 10గంటల వరకు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ పనుల నిమిత్తంగేటు మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. బోధన్, నిజామాబాద్ వెళ్లే వాహనదారులు సాటాపూర్, ఏఆర్‌పీ క్యాంప్, అంబం(వై) గుండా వెళ్లాలని సూచించారు.

పొగాకు దగ్ధం

బోధన్: రెంజల్ మండలంలోని బొర్గాం గ్రామంలో గురువారం రాత్రి ఈదురుగాలులకు మంటలు ఏర్పడి రాము అనే రైతుకు చెందిన పొగాకు దగ్ధమైంది. రెండు ఎకరాలకు సంబంధించిన పంట కాలిపోవడంతో సుమారు రూ. 2లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకున్న మండల రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

'అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' చైర్మన్‌గా ఈగ సంజీవరెడ్డి



నిజామాబాద్ నాగారం: అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏతిక్స్, డిసిప్లేన్ చైర్మన్‌గా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, అర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. సంజీవరెడ్డి ఎన్నికపై జిల్లాలోని పలు క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

కానరాని నీటి పొదుపు

- జల వనరులను కాపాడుకునే ప్రయత్నం చేయని ప్రజలు
- చైతన్యం చేయని ప్రభుత్వం, అధికారులు
- నేడు ప్రపంచ నీటి దినోత్సవం



డొంకేశ్వర్ మండలం దత్తాపూర్‌లో వృథాగా పోతున్న నీరు

డొంకేశ్వర్(ఆర్మూర్): అన్ని వనరుల్లోకెల్లా అతి ముఖ్యమైనది జలం. మానవులతో పాటు జీవరాశులకు ఇదే ప్రధాన జీవనాధారం. అలాంటి నీటిని కాపాడుకునే ప్రయత్నం ఎవరూ చేయడం లేదు. భూగర్భ జలాల పెంపునకు కృషి చేయకపోయినా కనీసం నీటిని పొదుపుగా కూడా వాడుకోవడం లేదు. తద్వారా ప్రతీ ఏడాది వేసవిలో కొన్ని ప్రాంతాల్లో గుక్కెడు నీటి కోసం అల్లాడే పరిస్థితి ఎదురవుతోంది. పంటలకు సాగునీరందక ఎండిపోతున్నాయి. నేడు 'ప్రపంచ నీటి దినోత్సవం' సందర్భంగా నీటి పొదుపుపై సాక్షి ప్రత్యేక కథనం.

కుళాయిల ద్వారా వృథాగా..

జల వనరులను ఏవిధంగా కాపాడుకోవాలనే విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికారులతో ప్రజలను చైతన్యం చేయించడం లేదు. దీంతో నీటి వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోయింది. నీటి వృథా కూడా అదే స్థాయిలో జరుగుతోంది. పల్లెల్లో వ్యవసాయ బోర్ల కనెక్షన్లు, గృహ వినియోగ బోర్ల కనెక్షన్లు ఎక్కువగా ఉంటున్నాయి. జిల్లాలో సమారు వ్యవసాయ బోరు బావులు సుమారుగా 1.81లక్షలు ఉండగా, గృహ బోరు కనెక్షన్లు 6.70లక్షలు ఉన్నట్లు అంచనా. అలాగే జిల్లాలో ప్రస్తుత సరాసరి నీటి మట్టం 10 మీటర్ల లోతు ఉన్నట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామాల్లో నీటి సరఫరా, వాడకంపై పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పర్యవేక్షణ చేయడం లేదు. వీధుల్లో, కుళాయిలకు ఆన్–ఆఫ్ సిస్టం లేకపోవడంతో గంటల తరబడి నీరు వృథాగా పోతుంది. తద్వారా భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. నిరంతరం బోర్లు నడవడంతో విద్యుత్ బిల్లులు కూడా ఎక్కువగా వస్తున్నాయి.

ఇంకిపోతున్న భూగర్భ జలాలు..

ప్రస్తుతం జిల్లాలో ఐదారు మండలాల్లో భూగర్భ జలాలు ఇంకిపోయాయి. భీమ్‌గల్, సిరికొండ, డిచ్‌పల్లి, ధర్పల్లి, ఇందల్వాయి, మోపాల్, నవీపేట్ మండలాల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఐతే, వేసవిలో సైతం భూగర్భ జలాలు ఇంకిపోకుండా ఉండాలంటే వ్యవసాయ క్షేత్రాల్లో ఫాంపాండ్‌లు నిర్మించుకోవాలి. అలాగే ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలను కట్టుకోవాలి. తద్వారా నీటి వృథా తగ్గి భూగర్భ జలాలు పెరగడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టి, ప్రజలు, రైతులను కూడా చైతన్యం చేయించాలి. అలాగే నీటిని వృథా చేయకుండా, తక్కువగా వాడే పరికరాలను వాడాలి. వాడిన నీటిని మళ్లీ ఉపయోగించే పద్ధతులను అవలంబించాలి.

ఇంకుడు గుంతలే మార్గం..



జిల్లాలో బోరుబావుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయాయి. తద్వారా నీటి వాడకం ఎక్కువైంది. వ్యవసాయ బోర్ల ద్వారా ఎక్కువగా నీటి వినియోగం జరుగుతుంది. నీటిని ఎంతంత వాడుతున్నారో అంతకు మించి సంరక్షించాలి. వ్యవసాయ భూముల్లో ఫారంపాండ్‌లు, ఇంటికో ఇంకుడుగుంత తప్పనిసరిగా నిర్మించుకోవాలి.

– శ్రీనివాస్ బాబు, జిల్లా భూగర్భజల శాఖ అధికారి

వామ్మో.. మొసళ్లు

- చెరువుల్లో ప్రత్యక్షమవుతున్న వైనం
- జంకుతున్న జాలర్లు



వేంపల్లి చెరువులో మొసలి

బాల్కొండ: ఊర చెరువుల్లో రోజుకో చోట మొసలి ప్రత్యక్షమవుతోంది. దీంతో ప్రజలు, జాలర్లు భయాందోళన చెందుతున్నారు. నాలుగు రోజుల క్రితం వెల్కటూర్ శివారులోని ఎల్లమ్మచెరువులో జాలర్ల వలకు మొసలి చిక్కింది. అది మరువక ముందే మళ్లీ ముప్కాల్ మండలం వేంపల్లి చెరువులో మొసలి ప్రత్యక్షమైంది. చెరువులో బండరాయిపై మొసలి ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు.. పశువులను నీరు తాగేందుకు కూడా పంపడం లేదు. రెంజర్ల, నల్లూర్, మెండోరా మండలం బుస్సాపూర్, సావెల్, మెండోరా చెరువుల్లో మొసళ్లు ఉన్నాయి.

చెరువుల్లో పట్టి ప్రాజెక్ట్‌లో వదిలి...


చెరువుల్లో పడుతున్న మొసళ్లను అటవీశాఖ అధికారులు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో వదులుతున్నారు. దీంతో అవి కాలువల ద్వారా మళ్లీ చెరువుల్లోకి వస్తున్నాయి. రెండు నెలల క్రితం ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ చెరువులో పట్టిన మొసలిని ఎస్సారెస్పీలో వదిలారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొసళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మత్స్యకారులు వేడుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..

చెరువుల్లో ఉన్న మొసళ్లను పట్టుకోవడానికి చర్యలు తీసుకుంటున్నాం. మొసళ్లను ఎవరూ రాళ్లు, కర్రలతో కొట్టవద్దు. బోనులు ఏర్పాటు చేసి పట్టే ప్రయత్నం చేస్తాం.

– గణేశ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, మెండోరా

విద్యుత్ పునరుద్ధరణకు 'హైపర్'



సుభాష్‌నగర్: భారీ వర్షాలు, ఈదురు గాలులు సంభవించినప్పుడు అతి తక్కువ సమయంలో విద్యుత్ పునరుద్ధరణ చేపట్టేందుకు 'హైపర్' కార్యచరణ ప్రణాళిక రూపొందించామని సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) రాపెల్లి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైపర్‌ను సమర్థవంతంగా నిర్వర్తించడానికి ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి, కార్యచరణను మెరుగుపర్చుకుంటూ గణనీయమైన అభివృద్ధి సాధించే దిశగా ముందుకు వెళ్తున్నామని స్పష్టంచేశారు.

హైపర్ అంటే (haiper)

హెచ్: హెడ్‌క్వార్టర్‌లో అప్రమత్తంగా ఉండటం
ఏ: సిబ్బంది, సామగ్రి సమీకరణ
ఐ: సమాచార సేకరణ, చేరవేయడం
పీ: పటిష్ట వ్యూహాన్ని అమలు చేయడం
ఈ: నిర్దిష్ట కార్యాచరణ అమలు
ఆర్: విద్యుత్ సరఫరా పునరుద్ధరణ.

వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థుల సాగు పాఠాలు



పాపారావు వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రకృతి వ్యవసాయ పాఠాలు నేర్చుకునేందుకు నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జైతాపూర్‌కు శనివారం నిర్మల్ జిల్లా జామ్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు వచ్చారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు పూర్తి చేసుకున్న పలువురు ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు, అధ్యాపకులు గ్రామంలో సుభాష్ పాలేకర్ విధానంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న కరుటూరి పాపారావు క్షేత్రాన్ని సందర్శించారు. రెండు గంటల పాటు వ్యవసాయ క్షేత్రంలో తిరుగుతూ విద్యార్థులు వివిధ అంశాల గురించి ఆసక్తిగా తెలుసుకున్నారు.



విద్యార్థులకు మొక్కల గురించి వివరిస్తున్న పాపారావు

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టే రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను విజయవంతంగా నిర్వహించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగాన్ని కాలరాస్తూ అన్ని రంగాలను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఇందుకోసం జై బాపు– జై భీం– జై సంవిధన్ నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు చేపడతామన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. పాదయాత్ర కోసం ప్రతిఒక్కరు సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నగర అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు, నాయకులు సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, ఏబీ శ్రీనివాస్, నగేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమే ష్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, జావేద్ అక్రమ్, రాంభూపాల్, గోపి, విపుల్‌గౌడ్, వేణురాజ్, నరేందర్‌గౌడ్, సంతోష్, లింగం, కెతావత్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యారంగంలో సమూల మార్పులు

- ప్రతి కోర్సుకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పురుషోత్తం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ఉన్నత చదువులు పూర్తి చేసిన విద్యార్థుల చేతికి సర్టిఫికెట్లు వస్తున్నాయి.. కానీ ఉద్యోగాలు రావడం లేదని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న సమస్యలకే పిరికితనంతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన కీలకవక్త గా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న తన సేవలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీ ఎం రేవంత్‌రెడ్డి తనకు చెప్పకుండానే ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించారని తెలి పారు. తెలంగాణ విద్యారంగాన్ని ఉన్న త స్థాయికి చేర్చాలని, నైపుణ్యం కలిగిన యువతను తీర్చిదిద్దాలనే సంకల్పంతో సీఎం ముందుకు సాగుతున్నార ని అన్నారు. విద్యను అర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఒక ప్రణాళిక ప్రకారం సిలబస్ మార్పునకు శ్రీకా రం చుట్టినట్లు తెలిపారు. ఇందు లో భాగంగా వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రతి కోర్సుకు ఇంటర్న్ షిప్ తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కోర్సు లో విద్యార్థులు చదువుతోపాటు ఇంటర్న్‌షిప్‌లో పా ల్గొనడం వల్ల ఉపాధి, ఉద్యోగావకాశాలు సాధించగలుగుతారని తెలిపారు. అలాగే సివిల్ సర్వీస్‌లో తెలంగాణ యువతకు తక్కువ అవకాశాలు వస్తున్నాయని, ఉత్తరాధి రాష్ట్రాల వారే సివిల్ సర్వెంట్లు గా మనపై పెత్తనం చెలాయిస్తున్నారని పేర్కొన్నా రు. సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఉండటం ఒక కారణమని గుర్తించి, దీనిపై కేంద్రంతో పోరాడి ప్రాంతీయ భాషల్లో సైతం ఇంటర్వ్యూలు చేపట్టేలా చేశామన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీఏ హానర్స్ సబ్జెక్టును తెలుగులో ప్రవేశపెట్టామని, ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థు లు సివిల్ పరీక్షల్లో మెరుగ్గా రాణించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే మ్యాథ్స్ సబ్జెక్టులో పోటీ పరీక్షల్లో ఇచ్చే ప్రశ్నలను విద్యార్థులకు నేర్పిస్తారని తెలిపారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లలో సమయాన్ని వృథా చేయవద్దని, చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. మారుమూల గ్రా మం నుంచి వచ్చిన తాను విద్య వల్లనే నేడు ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ స్థాయికి చేరుకున్నట్లు పు రుషోత్తం తెలిపారు. ఇప్పటికీ తమ గ్రామస్తులు ఆర్టీసీ బస్సును చూడలేదన్నారు. పురుషోత్తం యా దాద్రి భువనగిరి జిల్లా బొమ్మర రామారం మండలం గందమల్ల గ్రామానికి చెందిన వారు.

దేశాన్ని నడిపించేది అర్థశాస్త్రమే

దేశాన్ని నడిపించేది అర్థశాస్త్రమేనని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ పురుషోత్తం అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ అప్లయిడ్ ఎకనామిక్స్ విభాగాధిపతి పున్నయ్య అధ్యక్షతన శుక్రవారం క్యాంపస్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజ్ సెమినార్ హాల్‌లో 'రాష్ట్ర బడ్జెట్‌పై విశ్లేషణ' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ యాదగిరిరావు, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ పురుషోత్తం, రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడారు. అనంతరం పురుషోత్తంను వీసీ, రిజిస్ట్రార్‌లు సత్కరించారు. ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, సెమినార్ కన్వీనర్ పున్నయ్య, కోకన్వీనర్ సంపత్, అధ్యాపకులు రవీందర్‌రెడ్డి, పాత నాగరాజు, స్వప్న, శ్రీనివాస్, దత్తహరి ఉన్నారు.

డౌన్ సిండ్రోమ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



దివ్యాంగ చిన్నారులతో జడ్జి పద్మావతి, జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ, అధికారులు

నిజామాబాద్‌నాగారం: తల్లిదండ్రులు డౌన్ సిండ్రోమ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. నగరంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పద్మావతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డౌన్ సిండ్రోమ్ నివారణకు చర్యలు లేవని, గర్భ విచ్ఛిత్తి మాత్రమే మార్గమని తెలిపారు. ఈ పిల్లలు కొంచెం తెలివి తక్కువగా ఉంటారని, వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. డౌన్ సిండ్రోమ్ పిల్లలపై తల్లిదండ్రులు ప్రేమానురాగాలు, ఎక్కువ శ్రద్ధ చూపించినట్లయితే ఆ పిల్లల్లో మార్పు వస్తుందన్నారు. అనంతరం డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న డౌన్ సిండ్రోమ్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బి, వైద్యులు ప్రతిమారాజ్, రవితేజ, అవినాష్, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, అందుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు



వాడిలో వడగండ్ల వానకు రాలిపోయిన వరి గింజలు





తొండాకూర్‌లో వర్షానికి తడిసిన పసుపును ఆరబెడుతున్న రైతులు.. సిరికొండలో తడిచిన ధాన్యం కుప్పలు

సాక్షినెట్‌వర్క్: జిల్లాలోని పలు గ్రామాల్లో శుక్రవారం అకాల వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లోని చేతికొచ్చిన పంట దెబ్బతింది. అలాగే ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. పొలాల్లోని వరి నేలవాలింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

ఆశా వర్కర్ల పోరుబాట

- పీహెచ్‌సీల ఎదుట నిరసనలు
- రూ.15వేల వేతనం చెల్లించాలని డిమాండ్
- డిమాండ్ల సాధనకు 24న 'చలో కోఠి'



కమ్మర్‌పల్లి పీహెచ్‌సీ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

మోర్తాడ్(బాల్కొండ): తమ డిమాండ్ల సాధన కోసం ఆశా వర్కర్లు పోరుబాట పట్టారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని నిరసనలు తెలుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశావర్కర్ల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి, ప్రస్తుతం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రింబవళ్లు ప్రజారోగ్యం కోసం పనిచేస్తున్న తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని శుక్రవారం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

ఉద్యోగ భద్రత కోసం..

జిల్లాలో మొత్తం 1,280 ఆశావర్కర్ల పోస్టులు ఉండగా 1,196 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. కొందరు పని మానేయడం, మరికొందరు చనిపోవడంతో అక్కడక్కడా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడం, వారిని ప్రసవానికి ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లడం, మాతా శిశు సంరక్షణ తదితర సేవలను ఆశావర్కర్లు అందిస్తున్నారు. ఆరోగ్య సర్వేలు, ప్రజలకు వ్యాధులు, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించడం తదితర సేవలందిస్తూ ప్రజారోగ్యంలో కీలకంగా మారారు. వీరికి మొదట్లో నెలకు రూ.5 వేల పారితోషికం అందించేవారు. ఆ తర్వాత పనికి తగిన వేతనాలు చెల్లించడం మొదలు పెట్టారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాల పెంపుతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశావర్కర్లు కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటూ ఈ నెల 24న చలో కోఠి కార్యక్రమానికి పిలుపునిచ్చారు.

క్రైం కార్నర్

ఆటో–బైక్ ఢీ: పలువురికి తీవ్ర గాయాలు

రామారెడ్డి: రామారెడ్డి శివారులో శుక్రవారం రాత్రి ఆటో–బైకు ఢీకొనడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. కామారెడ్డి వైపు నుంచి రామారెడ్డి వచ్చే క్రమంలో వాహనాలు ఢీకొన్నట్లు సమాచారం. ప్రమాదంలో ఆటోలోని ఇద్దరు వ్యక్తులకు, బైక్‌పై ఉన్న దినేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అర్గుల్ గ్రామస్తులపై కేసు నమోదు

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి శుక్రవారం తెలిపారు. అర్గుల్ గ్రామ శివారులోని తన భూమిలోకి కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి డ్యామేజ్ చేసినట్లు పాలెం గ్రామానికి చెందిన ఏలేటి రవీందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అర్గుల్ గ్రామస్తులు భాస్కర్‌రెడ్డి, అల్కన్న, శేఖ్‌పాషా, రాంరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాపురానికి తీసుకెళ్లడం లేదని భార్య ఆందోళన



కుటుంబ సభ్యులు, కులస్తులతో కలిసి భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టిన బాధితురాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తనను కాపురానికి తీసుకెళ్లడం లేదని ఓ భార్య ఆందోళన చేపట్టిన ఘటన లింగంపేట మండలం కోమట్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. కేశాయిపేట గ్రామానికి చెందిన నెల్లూరి భాగ్య, కోమట్‌పల్లి గ్రామానికి చెందిన చీటూరి రాకేష్ ప్రేమించుకొని, పెద్దలను ఎదిరించి 2023లో పెళ్లి చేసుకున్నారు. కొన్ని నెలలు హైదరాబాద్‌లో కాపురం చేయగా భాగ్య గర్భం దాల్చింది. ఈక్రమంలో ఆమెకు కడుపు నొప్పి రావడంతో భర్త కొన్ని మందులు ఇచ్చాడు. గత నెల 21న నొప్పి తీవ్రం కావడంతో వైద్య పరీక్షలు చేయించగా గర్భంలోని శిశువు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అప్పటినుంచి భార్యను రాకేష్ మానసికంగా వేధింపులు గురిచేస్తుండేవాడు. ఈక్రమంలో ఆమెను హైదరాబాద్ నుంచి కేశాయిపేటలోని తన ఇంటికి తీసుకొచ్చి వదిలి పెట్టాడు. శుక్రవారం రాకేశ్ కోమట్‌పల్లికి వచ్చినట్లు తెలియడంతో కుటుంబ సభ్యులతో కలిసి ఆమె రాకేశ్ ఇంటికి వచ్చింది. దీంతో రాకేశ్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి పారిపోయాడు. తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి వెళ్లనంటూ బాధితురాలు టెంట్ వేసుకొని ఆందోళనకు దిగింది. అధికారులు, గ్రామస్తులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతుంది.